క్లుప్తంగా

విద్యా శక్తి తరగతులు ప్రారంభం



విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజూ ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఒక గంట రెమిడియర్ కెరీర్ గైడెన్స్‌లపై తరగతులు నిర్వహిస్తున్నట్లు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వడ్లపట్ల విజయకుమార్ అన్నారు. మంగళవారం ఆయన దెందులూరు ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ రెండు నెలలు ప్రతి రోజూ ఈ విద్యాశక్తి కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఉపాధ్యాయులు గొల్లపూడి వెంకటేశ్వరరావు, ప్రభుపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఉంగుటూరు: రాచూరు నంబర్ వన్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయులు దారపురెడ్డి శ్రీనివాసరావు ధాతృత్వంతో 80 మంది విద్యార్థులకు రాత పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లు, ఎరైజర్లు పంపిణీ చేశారు. ఈ విద్యా సామగ్రిని సర్పంచి దారపురెడ్డి సీత చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు చిన్ని సురేంద్ర, ఉపాధ్యాయురాలు దారపురెడ్డి తులసీలక్ష్మి, ఉపాధ్యాయులు నల్ల శ్రీను, జీవన జ్యోతి, నస్రీన్, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: పెదవేగి సెక్షన్, కూచింపూడి సబ్‌స్టేషన్ పరిధిలో గల కూచింపూడి గ్రామానికి చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం బుధవారం బుధవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

న్యాయవాదుల నిరసన

జంగారెడ్డిగూడెం: ఈ నెల 22న రేపల్లే మండలం పెనుమూడి గ్రామంలో సీనియర్ న్యాయవాది కొండపల్లి శ్రీనివాస్ దారుణ హత్యకు గురికావడం తీవ్ర దిగ్భ్రాంతిని గురిచేసిందని బార్ అసోసియేషన్ స్థానిక అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ శ్రీనివాస్ హత్యకు నిరసనగా 23, 24 తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఉపాధ్యక్షుడు మూడేపల్లి నాగులు, సీనియర్ న్యాయవాది నిమ్మగడ్డ రాంబాబు, పాశం సాయి ప్రతాప్‌లు మాట్లాడుతూ న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ట్రెజరర్ మానికల సూరిబాబు, లైబ్రరీ సెక్రటరీ బండారు లతాకుమారి, స్పోర్ట్స్ సెక్రటరీ సాబ్బన ఆనంద్, సీనియర్ న్యాయవాదులు మాడ రామ్మోహన్‌రావు, డీవీఆర్ కృష్ణ, రాయి వసంతరావు, వింజమూరి కిరణ్ కిషోర్, కురిమెళ్ల హరి తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురికావొద్దు

చింతలపూడి : విద్యాభారం, కుటుంబ ఒత్తిడులు వంటి సమస్యలతో మానసిక ఒత్తిడికి గురికావద్దని సీఐ క్రాంతి కుమార్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యువతలో పెరుగుతున్న సైబర్ నేరాలు, సోషల్ మీడియా వాడకంలో జాగ్రత్తలు, వ్యక్తిగత సమాచారం రక్షణ, ఆన్‌లైన్ మోసాలు, బాలల రక్షణ చట్టాలపై అవగాహన కలిగించారు. ఎస్సై శ్రీ సతీష్ కుమార్ మాట్లాడుతూ హెల్ప్ లైన్ నంబర్లను తెలియ చేశారు. విద్యార్థుల్లో నైతిక స్థైర్యం, చట్టాల పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు మహిళల స్వీయ రక్షణ చర్యలపై మాట్లాడారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి వైరు చోరీ

కొయ్యలగూడెం: అరిపాటి (కనకాద్రిపురం) సమీపంలో కౌలు రైతు సుంకర రాంబాబుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ (రాగి) వైరును దొంగిలించారు. దుండగులు పంపు సెట్టును కూడా ధ్వంసం చేశారని రాంబాబు మంగళవారం పేర్కొన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నమ్మించి.. నట్టేట ముంచి

- ఎన్నికల ముందు వలంటీర్లకు కూటమి వరాలు
- అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకే మంగళం
- రోడ్డున పడిన వలంటీర్ల కుటుంబాలు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్లను సన్మానిస్తున్న అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి (ఫైల్)



వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు (ఫైల్)

దెందులూరు: ఎన్నికల ముందు నమ్మబలికి కూటమి ప్రభుత్వం బలి తీసుకుందని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థణ/కొనసాగించకపోవడంతో ప్రజలకు కీలక సేవలు దూరమయ్యాయి. పైరవీలకు తావు లేకుండా ఐదేళ్లపాటు లబ్ధిదారుల ఇళ్ల వద్దనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రశంసలందుకున్న వలంటీర్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. గత ఏడాది ఎన్నికల ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచుతామంటూ ఊరూవాడా హోరెత్తించిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడారు. ప్రభుత్వ చర్యతో వలంటీర్ల కుటుంబాబు రోడ్డున పడ్డాయి. నమ్మి మోసపోయామని వలంటీర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఇంటి ముంగిటకే సేవలందించాలన్న గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రతి వార్డు, గ్రామ సచివాలయ పరిధిలో 50 కుటుంబాలకు ఓ వలంటీర్‌ను నియమించి సంక్షేమ పాలనను ప్రజలకు చేరువ చేసింది. దేశంలోనే తొలిసారి ఇలాంటి వ్యవస్థను ప్రవేశపెట్టి మన్ననలు అందుకుంది. అలాంటి వ్యవస్థను రాజకీయ అక్కసుతో కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసింది.

నాడు ప్రోత్సాహకాలు

కేవలం రూ.5 వేల గౌరవ వేతనంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లలో సేవా దృక్పథం పెంపొందించేందుకు వారికి గత ప్రభుత్వం నగదు పురస్కారాలను ప్రకటించింది. సేవా వజ్ర కింద రూ.45 వేలు, సేవా రత్న కింద రూ.30 వేలు, సేవా మిత్ర కింద రూ.15 వేలు ఏటా వలంటీర్లకు ప్రోత్సాహకాలను అందజేసింది.

పింఛన్ల పంపిణీలో వలంటీర్ సేవలు కీలకం

2014–2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రచ్చబండలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు గంటల కొద్దీ పడిగాపులు కాస్తూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వీటికి పరిష్కారం చూపాలని 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థకు రూపకల్పన చేసి, వలంటీర్ వ్యవస్థను రూపొందించి, తెల్లవారక ముందే పింఛన్‌దారుల ఇళ్ల వద్దకు పంపించి, పింఛన్ మొత్తం ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వృద్ధులకు నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్‌ను అందజేశారు. తుఫాన్లు, వరదల్లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్లు సేవలందించి, ప్రజల చేత శభాష్ అనిపించుకున్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు



వలంటీర్లతో పాటు అనేక వేల మంది ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో బాధితులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల ఉసురు కూటమి ప్రభుత్వానికి శాపంగా మారనుంది. రాబోయే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదు.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి

వలంటీర్ల సేవలు ఆదర్శనీయం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించిన వలంటీర్లు విశిష్ట సేవలు అందించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన నియామకం గురించి, వారు అందించిన సేవల గురించి దేశమంతటా విస్తృతంగా చర్చించుకున్నారు.

– ఎం.దుర్గా కుమారి రాజు, గ్రామ సర్పంచ్ మేదినరావుపాలెం

జీవనాధారం కోల్పోయాం



ప్రజల సమస్యలు ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేశాం. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందించాం. కూటమి ప్రభుత్వం వలంటీర్లు అందరినీ చిన్న చూపు చూసింది. వలంటీర్ల సేవలు నిలిపివేయడంతో మాపై ఆధారపడిన కుటుంబ సభ్యులతో జీవనాధారం లేకుండా రోడ్డును పడ్డాం.

– పెద్దిరాజు, వలంటీర్

నిరాశ్రయ కుటుంబాన్ని ఆదుకోవాలి

దెందులూరు: గాలాయగూడెం గ్రామంలో తాడి చెట్టు పడి ఇల్లు కూలిపోయిన దళిత కుటుంబాన్ని ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళి కోరారు. తాడి చెట్టు ఇంటి మీద పడినపుడు కుటుంబ సభ్యులు ఇంటిలో ఉన్నప్పటికీ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడం విశేషమన్నారు. దీంతో కుటుంబ సభ్యులు రోడ్డున పడ్డారని ప్రభుత్వం వారి పరిస్థితిని గమనించి వెంటనే గృహాన్ని నిర్మించాలన్నారు. బాధితుడి వయోభారం జీవన విధానం పరిగణనలోకి తీసుకొని ఆ కుటుంబ సభ్యులకు భద్రత, భవిష్యత్తు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అన్నమయ్య కీర్తనల ప్రచారం స్ఫూర్తిదాయకం



వాసుదేవరావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

పెదవేగి: అన్నమయ్య కీర్తనలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న అన్నమయ్య కీర్తనల ప్రచార సంఘం జిల్లా ప్రచారకర్త పెనుమాక వాసుదేవరావు స్వామి వారికి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని హేలాపురి ఆర్ష సేవా సమితి అధ్యక్షుడు అన్నారు. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన జిల్లా ప్రచారకర్త పెనుమాక వాసుదేవరావు ఆధ్యాత్మిక చింతన సమాజ సేవలు, ఆయన నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు నాయకులు వాసుదేవరావును ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. మంగళవారం ఏలూరులో హేలాపురి ఆర్ష సేవా సమితి వార్షికోత్సవం సందర్భంగా అంధ, పేద బ్రాహ్మణులకు విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు అందజేశారు.

నేతల విగ్రహాల ధ్వంసం దారుణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

దెందులూరు: మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమని వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ అన్నారు. చరిత్ర ఉన్నంత కాలం మహానేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని మహనీయునిగా కొనియాడతారని అటువంటి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని విరగ్గొట్టడం దేనికి సంకేతమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మానూరులో జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ కార్యాలయంలో నాయకులు మాట్లాడారు. ముంగర సంజీవ్‌కుమార్, పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చనిపోయి 15 ఏళ్లు కావస్తున్నా ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తా రని అటువంటి మహానేత విగ్రహం ధ్వంసం చేయ డం తగదన్నారు. దుగ్గిరాలలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేయి విరగ్గొట్టడం ఏ సంస్కృతికి నిదర్శనమని ఏరాజ్యాంగం అమలు చేస్తు న్నారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ మాట్లాడుతూ ప్రభు త్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. దోషులను గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వార్డ్ మెంబర్‌కు వైఎస్సార్‌సీపీ నేతల ఆర్థిక సాయం



బాధితురాలికి సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: గోపన్నపాలెం పంచాయతీ మూడో వార్డు మెంబర్ యంత్రపాటి నాగమ్మకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, దాతలు రూ.43 వేల ఆర్థిక సాయం అందించారు. మంగళవారం గోపన్నపాలెంలోని బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి నగదును తోట పద్మారావు అందజేశారు. ఈ సందర్భంగా గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగ ఇన్‌చార్జి తోట పద్మారావు మాట్లాడుతూ బాధితురాలికి ఆర్థిక సాయమందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రచార విభాగపు ఇన్‌చార్జి తోట పద్మారావు సహృదయంతో వైఎస్సార్‌సీపీ గ్రూపులో బాధితురాలు అనారోగ్యం తెలియజేసి దాతలు ఇచ్చిన నగదును బాధితురాలి కుటుంబానికి అందజేయడం ఈ 15 రోజుల్లో పద్మారావు పడిన శ్రమ చేసిన కృషిని మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఉంగుటూరు: ఎంపీడీవో రాజీమనోజకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు



గణపవరం: ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉంగుటూరు: సచివాలయ ఉద్యోగులు వారి సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేసి, ఎంపీడీవోలకు వినతి పత్రాలను సమర్పించారు. సచివాయ ఉద్యోగులకు వేరే మండలానికి గాని ఇదే మండలంలో వేరే గ్రామాలకు బదిలీల అవకాశం కల్పించాలని ఉంగుటూరు మండలం సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో రాజీమనోజుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో ఒక వార్డులో పని చేసే ఉద్యోగులకు పక్క వార్డులో బదిలీకి అవకాశం కల్పించారని అలాగే మాకు కూడా కల్పించాలని వారు కోరారు. సచివాలయాలు గ్రేడు–5, సర్వేయర్లు, డిజిటల్ సహాయకులు, వ్యవసాయశాఖ సహాయకులు తదితర ఉద్యోగులుపాల్గొని వారి డిమాండ్‌ను వినిపించారు.

ముందు పదోన్నతుల సంగతి తేల్చాలి

గణపవరం: ముందుగా తమ పదోన్నతుల సంగతి తేల్చాలని, తరువాతే బదిలీలను చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు నినదించారు. ఈ మేరకు గణపవరం మండల సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 5ను సవరించాలని, సొంత మండలంలో పని చేసేలా సచివాలయ ఉద్యోగులకు అవకాశం కల్పించాలని రేషనలైజేషన్‌లో మిగులు సిబ్బంది పరిస్థితి ఏమిటో చెప్పాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని సచివాలయ ఉద్యోగులు నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయ ఉద్యోగులు ఏపీజేఈఏ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

ట్రిపుల్‌ఐటీకి విద్యార్థుల ఎంపిక



పోతల మౌనిక



పిల్లా పూజిత



డి.కీర్తన పల్లవి

గణపవరం: గణపవరంలోని చింతలపాటి సూరయ్యమ్మ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు పొందారు. పోతల మౌనిక, పిల్లా పూజిత, డి.కీర్తన పల్లవి ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించారు. మౌనకి, పూజితలకు ఒంగోలు, కీర్తన పల్లవి శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం తోట సింహాద్రి అప్పారావు తెలిపారు.

ఉంగుటూరు విద్యార్థులు ఎంపిక

ఉంగుటూరు: ట్రిపుల్‌ఐటీలో సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులను నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూలులో సత్కరించారు. మంగళవారం హెచ్ఎం తోట పోతురాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి హైస్కూలులో చదివిన జుత్తిక అభినయశ్రీ, గుడ్ల హర్షప్రియలకు ట్రిపుల్‌ఐటీలో సీట్లు లభించాయి.

గ్రాట్యుటీలు చెల్లించకపోవడం దారుణం



మాట్లాడుతున్న అబ్బదాసరి శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పదవీ విరమణ పొంది ఏడాది కాలం పూర్తయినా ఆ ఉపాధ్యాయులకు గ్రాట్యుటీలు చెల్లించకపోవడం దారుణమని ఏపీటీఎఫ్ నగర అధ్యక్షుడు కురుమ ఆనందకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ సమావేశం స్థానిక గాంధీ నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షుడు తాళ్లూరి రామారావు మాట్లాడుతూ తాజాగా బదిలీ అయ్యి క్లస్టర్ల వేకెన్సీలోకి వెళ్లిన మిగులు ఉపాధ్యాయులకు సకాలంలో జూన్ నెల వేతనాలు ఇవ్వాలని, వారిని సీఎఫ్ఎంఎస్‌కు అనుసంధానం చేసి పొజిషన్ ఐడీలను కేటాయించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎల్‌వీపీ రత్న కుమార్ మాట్లాడుతూ మిగులు ఉపాధ్యాయులను కార్పొరేషన్ పాఠశాలల్లోనే త్వరగా సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు మాట్లాడుతూ 3 పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని కోరారు. ఉపాధ్యక్షుడు ఎండబ్ల్యూ బెనర్జీ, కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ చింతా వెంకటరత్నం, నగర ప్రధాన కార్యదర్శి అబ్బదాసరి శ్రీనివాసరావు మాట్లాడారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు కె.పాట్టియ్య, కార్యదర్శి తొమ్మంద్రు ప్రకాష్, జిల్లా కౌన్సిలర్లు వీవీ సుబ్రహ్మణ్యం, కొడమంచిలి కుమార్, జంపిన శాంతి కుమార్, పి.రోజా, ఎస్ఎస్ ప్రతాప్, కె.సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పురపాలక సంఘం పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్మికులకు ప్రతి నెలా జీతాలు ఆలస్యం అవుతూనే ఉన్నాయని, ప్రస్తుతం రెండు నెలలు గడుస్తున్నా ఇంకా జీతాలు చెల్లించేలని తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభించి 10 రోజులు అయిందని, పిల్లలు స్కూల్, కాలేజీలలో చేర్పించేందుకు చేతిలో పైసలు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నామని వివరించారు. కమిషనర్ వెంటనే స్పందించి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్‌లు కోరారు. జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, ఇంజినీరింగ్ విభాగం కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో ట్రాఫిక్ జామ్

ఉంగుటూరు: ఉంగుటూరులో లారీ దిగబడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. నారాయణపురం నుంచి ఉంగుటూరు వస్తున్న లారీ ఎస్సీ హాస్టల్ సమీపంలో దిగబడిపోవడంతో సుమారు అర గంట వాహనాలు కదిలేందుకు వీలు లేక ఆగిపోయాయి.

మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భీమడోలు: మలేరియా జ్వరాలపై ఆరోగ్య కార్యకర్తలు సంపూర్ణ అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జాహ్నవి అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా గుండుగొలనులో మంగళవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. మలేరియా అంతం మనతోనే, దోమల నిర్మూలన మనందరి బాధ్యత, ఫ్రైడే డ్రైడే వంటి నినాదాలు చేశారు. ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి, కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా జ్వరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని అన్నారు. జ్వరం వస్తే సమీపంలోని ఆరోగ్య సిబ్బందిని, ఆశా వర్కర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సీఎంవో ఇందిరా, హెల్త్ ఎడ్యుకేటర్ మధుబాబు, హెల్త్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, రాజు, ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో సాంకేతికతతో అధిక దిగుబడులు



భీమడోలు: కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా



రైతులతో మాట్లాడుతున్న ఏవో ఆశీర్వాదం

భీమడోలు: వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతికతను అందిపుచ్చుకొని రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా అన్నారు. గుండుగొలనులో మంగళవారం మండల ఏవో ఎస్‌పీపీ ఉషారాణి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్, ఏడీఏ ఉషారాజకుమారి పాల్గొని రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టిని సారించాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం పెరగాలని సూచించారు. రైతులకు కొత్తగా వచ్చిన వరి వంగడాలను మినీ కిట్ల రూపంలో అందించారు. ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ వరి సాగులో రైతులు నారుమడి యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా చక్కని ఫలితాలు పొందొచ్చన్నారు. ఏడీఏ ఉషారాజకుమారి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 268 ఎకరాల్లో నారుమడులు పోశారని, 30 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. అనంతరం కందులు, వరి వంగడాల కిట్లను రైతులకు అందించారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్ఏ, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలి

నిడమర్రు: రైతులు నాణ్యమైన వరి విత్తనాలను ఎంపిక చేసుకుంటే చీడపీడల బెడద తగ్గుతుందని, అధిక దిగుబడులు సాధించొచ్చని నిడమర్రు మండల వ్యవసాయ అధికారి దైవ ఆశీర్వాదం అన్నారు. మంగళవారం మండలంలోని ఛానమిల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. సార్వా సీజన్ ఆరంభమైనందున రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని, పైపైన దుక్కి చేసి సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా కౌలు రైతు కార్డులు పొందాలని, తద్వారా ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రయోజనాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు బేతు శివ వెంకట రామారావు, ముత్యాల స్వామి, ముత్యాల ఏసు, గౌతు వెంకన్న, యర్రంశెట్టి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ఆక్వా సదస్సులో పాల్గొన్న అధికారులు

గణపవరం: ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు ఆక్వా రైతులు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం గణపవరం మండలం గణపవరం, పిప్పర, కేశవరం, సరిపల్లె, కొత్తపల్లి, ముప్పర్తిపాడు, జల్లి కాకినాడ, తదితర గ్రామాల్లో ఆక్వా రైతులకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న పలువురు రైతులు గిట్టుబాటు ధర, విద్యుత్ సబ్సిడీ, ఆక్వా జోన్ వర్తింపు తదితర సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులు ఆక్వా జోన్‌లోకి మారడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు సాగులో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సదస్సులో సర్పంచ్ మూర అలంకారం, ఎఫ్‌డీవో శివ రామకృష్ణ, సహాయకురాలు షర్మిల, తదితరులు పాల్గొన్నారు.